క్లుప్తంగా

నేటి నుంచి ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు

రంగంపేట: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో మండలంలో 810 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారన్నారు. సాధారణ రకం (ముతకలు) 75 కేజీలు రూ.1,637, 100 కేజీలు రూ.2,183 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని చెప్పారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం


కొంకుదురులో సత్తెమ్మ తల్లిని ఊరేగిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో పడాల వంశీయుల కులదేవతైన సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులతో గ్రామంలో ఊరేగించారు. పడాల వారి ఆడపడుచుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. అనంతరం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పడాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా అన్న సమారాధన

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు మదుగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్ రెడ్డి, సత్తిరెడ్డి, గంగాధర్ రెడ్డి, రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

210 మందికి వైద్య పరీక్షలు


వేండ్రలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యుడు క్రాంతికుమార్

పెదపూడి: మండలంలోని వేండ్రలో ద్రాక్షారామకు చెందిన ఓ దంత ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ కోసూరి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శిబిరంలో వైద్యుడు క్రాంతికుమార్ 210 మందికి దంత పరీక్షలను చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరులో ద్రాక్షరామ భీమేశ్వర దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, టూత్ పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోని సర్పంచి సాయిరాం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జనుముతో అధిక పాల దిగుబడి


బూరుగుపూడిలో జనుము పంట

కోరుకొండ: పాడి పశువుల పెంపకంలో మేతకు అత్యంత ప్రాధాన్యం ఉంది. పోషక విలువలు కలిగిన మేతను పశువులకు అందిస్తే, వాటి నుంచి పాల దిగుబడి కూడా అధికంగానే ఉంటుంది. గ్రామాల్లో వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం అదనపు ఆదాయ వనరుగా ఉంటుంది. పశువులకు జనుము బలవర్ధక ఆహారమని చెప్పవచ్చు. దీనిని దాణాతో కలిపి పశువులకు ఇవ్వడం వల్ల అనేక లాభాలు ఉంటాయి. పచ్చిమేతకు కొరత ఏర్పడిన నేపథ్యంలో జనుము ఉపయోగపడుతోంది. వరికోతల్లో యంత్రాల వినియోగం కారణంగా ఎండగడ్డికి కూడా కొరత ఏర్పడింది. దీంతో పాడి రైతులు జనుమును తమ పశువులకు ఆహారంగా ఇస్తున్నారు. నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో సుమారు 19,565 ఆవులు, 44,076 గేదెలున్నాయి. జనుమును పొలం నుంచి తీసుకొచ్చి, దాన్ని ముక్కలుగా కత్తిరించి పశువులకు అందజేయాలి.

పల్లె ముంగిటకు ప్రభుత్వ పాలన

- సచివాలయాల రాకతో అందుబాటులోకి సకల సేవలు
- గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ప్రభుత్వం

బిక్కవోలు: ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో, అవినీతికి తావులేకుండా ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను పల్లె ముంగిటకు తీసుకొచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు బాటలు వేశారు. సచివాలయాల వల్ల ప్రజలకు అక్కడికక్కడే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుండడంతో అందరి నుంచి హర్షం వ్యక్తమవుతుంది. గ్రామ సచివాలయాల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రభుత్వ సేవలను క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయడమనేది సంచలనాత్మమైన నిర్ణయమని నిపుణులు చెబుతున్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రజలు గతంలో ప్రతి పనికి మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల సమయం, నగదు వృథా అయ్యేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు.


పందలపాక సచివాలయం

సచివాలయాల్లో 10 నుంచి 12 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులను నియమించారు. ఈ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లోనే ప్రజల పనులన్నీ పూర్తవుతున్నాయి. దీంతో సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మరోవైపు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు అర్హత కలిగిన వారితో వలంటీర్లే దరఖాస్తు చేయించి సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరవేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి మరీ వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 79 సచివాలయాలు ఏర్పాటు చేశారు. 2022 జనవరి 1 నుంచి 2024 మార్చి 31 వరకూ అనపర్తి నియోజకవర్గంలో 4,51,479 సేవలను సచివాలయాల ద్వారా ప్రజలకు అందించారు.

సచివాలయాల ద్వారా అందించిన సేవలు

మండలం	సేవలు
అనపర్తి	1,41,405
బిక్కవోలు	1,40,334
రంగంపేట	92,102
పెదపూడి	77,638
మొత్తం	4,51,479

ఇంటి వద్దకే సకల సేవలు



గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రాల్లోని అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సచివాలయాలు వచ్చాక సొంత ఊళ్లోనే అన్ని సేవలు అందుతున్నాయి. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు, సేవలు అందిస్తున్నారు. అప్పటికి ఇప్పటికీ చాలా మార్పు కనిపిస్తుంది.
– గొర్రిపోటి లక్ష్మి, వృద్ధురాలు, కొంకుదురు

ఇదే పాలన కొనసాగాలి



ప్రతి చిన్న పనికి మండల కేంద్రాలకు ఎన్నిసార్లని తిరగగలుగుతాం..? గతంలో అలాగే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు తీసుకొచ్చి వలంటీర్లను నియమించి దరఖాస్తు మొదలు పథకాల అందజేత వరకూ ఇంటి ముంగిటకే సకల సేవలు అందిస్తున్నారు. ఇదే పాలన కొనసాగాలి.
– యాసలపు రామకృష్ణ, వృద్ధుడు, పందలపాక

చలివేంద్రం ప్రారంభం


జి.మామిడాడలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాల వద్ద గొల్లల మామిడాడ రెడ్డి యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నేత ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నల్లమిల్లి రాహుల్‌రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, సత్తి భగవాన్‌రెడ్డి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష


గుమ్ములూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- గుమ్ములూరులో ఎన్నికల ప్రచారం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం గుమ్ములూరులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీతలా భావించి, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు జరిపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేశారన్నారు. ప్రజలను మోసం చేయడానికే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఏర్పడిందన్నారు గతంలో 650 హామీలిచ్చిన చంద్రబాబు, వాటిని అమలు జరపకుండా మోసం చేశారన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, గ్రామ మాజీ సర్పంచ్ మట్టా


బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం

పెద్ద వెంకటేశ్వర్లు, చీంద్రిం శ్రీహరి పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

మధురపూడి: మండలంలోని బూరుగుపూడి, మునగాల, జంబూపట్నం, కోరుకొండ గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కన్వీనర ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ, వైఎస్సార్ రైతు విభాగం జిల్లా కార్యదర్శి మండపాక శ్రీను, జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్న దొర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలిపించండి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- కుమారప్రియంలో ఇంటింటా ప్రచారం

పెదపూడి: పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అభ్యర్థించారు. మండలంలోని కుమారప్రియం గ్రామంలో ఆదివారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి అందరూ ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తన భర్త సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో


కుమారప్రియంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పెమ్మనబోయిన సత్తిబాబు, మాజీ సర్పంచులు తోటకూర విశ్వేశ్వరరావు, పెమ్మనబోయిన సాయిరామ్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, మంగం సత్యనారాయణ, తోటకూర పెదవెంకట్రావు, నర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు


కాపవరంలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


కోరుకొండలో సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న క్రైస్తవులు

పెదపూడి: ఏసు క్రీస్తు మరణాన్ని జయించి మూడో రోజు తిరిగి లేవడాన్ని పురస్కరించుకుని పునరుత్థాన పండగ(ఈస్టర్) వేడుకలను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈస్టర్ సందర్భంగా ముందుగానే చర్చిలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు మృతులైన వారి బంధువుల సమాధులను ఆదివారం తెల్లవారుజామున దర్శించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెదపూడి బేతేలు చర్చిలో బిషప్ చుక్కా శామ్యూల్‌రాజు, దేవకుమారి దంపతులు దైవ సందేశాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం ప్రేమ విందులో భోజనాలు చేశారు. పాస్టర్ చుక్కా జాన్ రత్నం, చుక్కా దేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని వివిధ చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పందలపాకలోని చర్చిలో క్రైస్తవులు దైవగీతాలు ఆలపించారు. ఏసు క్రీస్తు మార్గం అనుసరణీయమని బిషప్ ఎంఎస్ సమర్పణ్ అన్నారు. ఊలపల్లిలో పాస్టర్ ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో ఆరాధన నిర్వహించారు. కాపవరంలో క్రైస్తవులు సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కర్రి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ఈస్టర్ ప్రార్థనలు

మధురపూడి: ఈస్టర్ పర్వదినం సందర్భంగా చర్చిలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే బంధువులు, కుటుంబ సభ్యుల సమాధులను శుభ్రం చేసి, పువ్వులు, కొవ్వొత్తులతో అలంకరించారు. కోరుకొండ మండలం కాపవరంలోని బైబిల్ మిషన్, కోటికేశవరం, పశ్చిమగానుగూడెం, గాడాల, బూరుగుపూడి, దోసకాయలపల్లి గ్రామాల్లోని లూథరన్ తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారు

- వలంటీర్ వ్యవస్థను రూపుమాపడమే ఆయన లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తూ, ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ వ్యవస్థను రూపుమాపేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మండి పడ్డారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజల గడప ముంగిటకు చేర్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలైన సేవలు అందుతున్నాయని అన్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై కక్ష కట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వలంటీర్లపై విషం చిమ్ముతూ ఎల్లో మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎక్కడో ఒక వలంటీర్ తప్పు చేస్తే దాన్ని వ్యవస్థ మొత్తానికి ఆపాదించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఒకపక్క టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని చెబుతూనే మరోవైపు ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. పేదలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను నిలుపుదల చేయాలన్న దురాలోచనతో చంద్రబాబు తన అనుచరులతో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల ద్వారా ఇంటికే పెన్షన్ల ప్రక్రియను అడ్డుకున్నారన్నారు. వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయాల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారని, చంద్రబాబు కుట్రలకు సంక్షేమ పథకాల లబ్ధిదారులు బలవుతారని చెప్పారు. జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తారని, దీంతో లబ్ధిదారులు ఆయా సంక్షేమ పథకాల కోసం పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందేనని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందన్న విషయాన్ని ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు. సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పారదర్శకంగా పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ
- ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కుల, మత, వర్గ, పార్టీ రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. ఆమె ఆదివారం ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్త జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఎన్నికల బరిలో ఉన్నారని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఐదేళ్ల మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరిగిందన్నారు. మహిళల సాధికారత కోసం జగన్ విశేషంగా కృషి చేశారని, మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలను అందించి వారి ఆర్థిక పురోగాభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఇలాంటి


ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ


ఆస్పత్రిలో పోశారావును పరామర్శిస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

మంచి పథకాలు అమలు కావాలంటే మేలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, చల్లమళ్ల సుజీరాజు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, ఆళ్ల కోటేశ్వరరావు, సాదే చంటిబాబు, రుద్రం వీరేంద్ర, నిడదవోలు సుబ్బారావు, కూచిపూడి భాను, రుద్రం వెంకన్న, కూచిపూడి బాబ్జి, పెండ్యాల చౌదరి పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

సీతానగరం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ ఆదివారం పరామర్శించారు. రాజానగరం మండలం దివాన్ చెరువుకు చెందిన బుడ్డిగ వెంకట రమణ న్యూరో సంబంధిత వ్యాధితో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని సాయి హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. సీతానగరానికి చెందిన ఆళ్ల రాయుడు గుండె సమస్యతో సాయి హాస్పటల్‌లో చేరారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నానికి చెందిన అన్విక అనే బాలిక మాగ్నా హాస్పటల్‌లో చికిత్స పొందుతోంది. వీరందరికీ డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పరామర్శించారు. డెల్టా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెదుళ్లపల్లికి చెందిన రుద్రం శ్రీను, సీతానగరం పంచాయతీ లంకూరుకు చెందిన మట్టా పోశారావులను కూడా పరామర్శించారు.

ఉపకరణాల పంపిణీ నిర్ధారణ శిబిరం

కంబాలచెరువు: ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగులకు సమగ్ర శిక్షా, సహిత విద్య ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, అనపర్తి, బిక్కవోలు మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ శిబిరానికి హాజరయ్యారు. డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని ఇవ్వాలన్నారు. భవిత కేంద్రాల్లో వారికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఐదు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్లు, మూడు రోజులు వేరు శనగ చిక్కీ, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీవీబీఎస్ నారాయణ, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎన్.కనకబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ


సూర్యారావుపేటలో పాత ఎన్‌హెచ్‌ను ఆనుకుని వేసిన లేఅవుట్

రాజానగరం: మండలంలోని సూర్యారావుపేటలో పాత ఎన్‌హెచ్‌ని ఆనుకుని కొత్తగా వేసిన లేఅవుట్‌లో పుంత రోడ్డు, చెరువుల ఆక్రమణలు అడ్డూ అదుపు లేకుండా జరిగిపోతున్నాయని జనవిజ్ఞాన సమితి అధ్యక్షురాలు వారా శ్రీదేవి ఆరోపించారు. రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్మశానాన్ని కూడా వదల్లేదన్నారు. అంతేకాక ఈ వెంచర్ నిలువెత్తు లోతులో ఉందని, భారీ వర్షాలకు ఆ ప్రాంతం తరచూ ముంపునకు గురవుతుందన్నారు. ఫరిజల్లిపేట, కానవరం, చక్రద్వారబంధం గ్రామాల నుంచి వచ్చే ముంపు నీరు దిగువకు పోయేందుకు ఇదే మార్గమన్నారు. అయితే ఈ వెంచర్‌లో చిన్నపాటి కాలువను ఆ ముంపు నీరు పోయే విధంగా చూపి, కొనుగోలుదారులను కూడా మోసం చేస్తున్నారని వాపోయారు. కాగా ఉన్నతాధికారులు ఈ వెంచర్‌లో జరిగిన, జరుగుతున్న ఆక్రమణల పై దృష్టిని సారించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. అలాగే రుడా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.